క్లుప్తంగా

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

జడ్చర్ల టౌన్‌: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో ఉమెన్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ ఆధ్వర్యంలో దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలు



స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: జిల్లా కేంద్రంలోని వీహెచ్‌పీ కార్యాలయంలో ఆదివారం జిల్లాస్థాయి భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ ప్రతినిధులు మాట్లాడుతూ ఐదు విభాగాల్లో జిల్లాస్థాయి భగవద్గీత శ్లోకకంఠస్థ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారు ఈనెల 17న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, కార్యదక్షులు బుచ్చారెడ్డి, కార్యదర్శి లక్ష్మీ నారాయణ, కోశాధికారి శ్రీధర్‌బాబు, సురేష్‌బాబు, రాచాల జనార్దన్‌, ప్రాణేష్‌, శ్రీకాంత్‌, హన్మంతు, సింధుజ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్‌ ఎంపికలు



మహబూబ్‌నగర్‌ క్రీడలు: రాష్ట్రస్థాయి స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించాలని జిల్లా ఎస్‌జీఎఫ్‌ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్‌ డిగ్రీ కళాశాల ఆవరణలో కరాటే మాస్టర్‌ ఎస్‌కే.మోసీన్‌ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లా అండర్‌–14, అండర్‌–17 స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ కరాటే ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌ మాట్లాడుతూ కరాటే పోటీల్లో రాణించాలని కోరారు. నేడు (సోమవారం) నల్గొండ జిల్లాలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ కరాటే పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్‌ సహాయ కార్యదర్శి వేణుగోపాల్‌, జిల్లా రగ్బీ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి నిరంజన్‌ రావు, కరాటే మాస్టర్లు అమ్రేష్‌, రవి, కృష్ణ, మోసిన్‌ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీకి తరలిన మహిళా జట్టు



మహబూబ్‌నగర్‌ క్రీడలు: నిజామాబాద్‌ జిల్లా బుస్సాపూర్‌లో సోమవారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి సీనియర్‌ మహిళా కబడ్డీ టోర్నీకి జిల్లా జట్టు ఆదివారం తరలివెళ్లింది. జట్టును జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్‌ అభినందించారు. రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీలు బాల్‌రాజు, రాజవర్ధన్‌ రెడ్డి, మల్లేష్‌, శివాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్‌ అథ్లెటిక్స్‌ పోటీల్లో పతకాలు సాధించాలి

మహబూబ్‌నగర్‌ క్రీడలు: స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన అథ్లెటిక్స్‌ పోటీల్లో క్రీడాకారులు పతకాలు సాధించాలని జిల్లా ఎస్‌జీఎఫ్‌ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్‌ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్‌ అండర్‌–14 విభాగం అథ్లెటిక్స్‌ ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 150 మంది బాల, బాలికలు హాజరయ్యారు. వీరికి వివిధ అథ్లెటిక్స్‌ అంశాల్లో ఎంపికలు నిర్వహించారు. రమేశ్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరచాలని కోరారు. కార్యక్రమంలో పెటాటీఎస్‌ జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌గౌడ్‌, వేణుగోపాల్‌, పరశురాం, బాల్‌రాజు, ఆనంద్‌కుమార్‌, రమణ, నిరంజన్‌రావు, శ్రీనివాసులు, అంజనమ్మ, ప్రసన్న, శ్రీను, జగదీశ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులపై దాడి

మహబూబ్‌నగర్‌ క్రైం: రోడ్డుపై నిలబడిన ఉన్న ఇద్దరు వ్యక్తులను కొందరు యువకులు అకారణంగా కట్టెలతో దాడి చేయడంతో రక్త గాయాలు అయ్యాయి. హన్వాడ మండలం పల్లెమోని కాలనీకి చెందిన పి.వెంకటయ్య, ఆంజనేయులు ఇద్దరూ ఆదివారం రాత్రి 7.40 గంటల ప్రాంతంలో గ్రామంలోని వారి ఇంటి దగ్గర ఉన్న సమయంలో అటువైపు కాంగ్రెస్‌ పార్టీ నాయకులు విజయోత్సవ ర్యాలీ తీశారు. ఈ క్రమంలోనే అదే గ్రామానికి చెందిన పి.శ్రీకాంత్‌, పి.రమేష్‌, పి.శివకుమార్‌లు పాత విషయాలు మనసులో పెట్టుకుని పి.వెంకటయ్య, ఆంజనేయులుపై కట్టెలతో దాడి చేశారు. దీంతో ఇరువురికి రక్తగాయాలు అయ్యాయి. బాధితుడు పి.వెంకటయ్య హన్వాడ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పాలమూరులో ఎగిరిన కాంగ్రెస్‌ జెండా

మహబూబ్‌నగర్‌ 'యెన్నం'దే..

- మొదటి ఐదు రౌండ్‌లలో బీఆర్‌ఎస్‌ ముందజ
- 7వ రౌండ్‌ నుంచి లీడ్‌ సాధించిన యెన్నం
- 18,738 ఓట్ల తేడాతో గెలుపు

పాలమూరు: ఉత్కంఠ రేపిన అసెంబ్లీ ఫలితాల్లో విజయం కాంగ్రెస్‌ అభ్యర్థిని వరించింది. మొదటి ఐదు రౌండ్‌లలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి వి.శ్రీనివాస్‌గౌడ్‌ ముందజలో ఉన్నారు. ఆ తర్వాత 6వ రౌండ్‌ నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్వల్పంగా లీడ్‌ సాధించారు. అక్కడి నుంచి రౌండ్‌లు పెరుగుతున్న కొద్ది క్రమంగా మెజార్టీ పెరుగుతూ 18738ఓట్ల తేడాతో గెలుపొందారు.

రౌండ్‌	కాంగ్రెస్‌ (యెన్నం శ్రీనివాస్‌రెడ్డి)	బీఆర్‌ఎస్‌ (వి.శ్రీనివాస్‌గౌడ్‌)	బీజేపీ (ఏపీ మిథున్‌రెడ్డి)
1	4143	4526	701
2	4454	4507	1171
3	4169	4639	979
4	4755	4011	1072
5	4969	4872	932
6	4395	4124	1161
7	4355	3351	944
8	4379	3288	1137
9	4302	2036	547
10	4463	2613	757
11	4441	2629	718
12	5935	3874	530
13	3924	3346	1338
14	2979	2780	1864
15	3625	2736	1080
16	4797	2776	1200
17	3825	3416	1432
18	4228	3534	767
19	3801	2534	667
20	2789	2144	379
	84728	67736	19376

జడ్చర్లలో రౌండ్‌ల వారీగా..

జడ్చర్ల/జడ్చర్ల టౌన్‌: నియోజకవర్గం ఆదివారం జరిగిన కౌంటింగ్‌లో కాంగ్రెస్‌ వశమైంది. ఇక్కడ ప్రధానంగా కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీల మధ్య పోటీ నెలకొంది. మొత్తం 20రౌండ్లలో జరిగిన ఓట్ల లెక్కింపునకు సంబంధించి ప్రధాన పార్టీల అభ్యర్థులకు పోలైన ఓట్లు ఇలా ఉన్నాయి.

రౌండ్‌ నం.	కాంగ్రెస్‌ అనిరుధ్‌రెడ్డి	బీఆర్‌ఎస్‌ సి. లక్ష్మారెడ్డి	బీజేపీ చిత్తరంజన్‌దాస్‌
1	3929	3521	252
2	8937	7017	625
3	4848	4047	358
4	4453	3381	429
5	3662	5375	376
6	4368	4213	263
7	5188	3797	233
8	5503	3410	319
9	5107	4197	301
10	3140	4223	334
11	5357	3401	531
12	3901	3888	361
13	4261	4118	978
14	3576	3139	536
15	4980	3199	220
16	3946	3643	168
17	4244	3590	242
18	5229	4265	398
19	4755	4492	353
20	2690	2118	194
	90145	75515	7471

యెన్నం విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవర్యాలీలో యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: మహబూబ్‌నగర్‌ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందిన యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కౌంటింగ్‌ కేంద్రం ఎదుట నుంచి ప్రారంభమైన ర్యాలీ బండమీదిపల్లి చౌరస్తా, హబీబ్‌నగర్‌ మీదుగా వన్‌టౌన్‌ చౌరస్తా వరకు నిర్వహించారు. దాదాపు రెండు గంటలపాటు విజయోత్సవ ర్యాలీ కొనసాగింది. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్‌, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్‌, ఎన్‌పీ వెంకటేశ్‌, సురేందర్‌ రెడ్డి, రాధా అమర్‌, అమరేందర్‌రాజు తదితరులు ఉన్నారు.

ఈ విజయం మహబూబ్‌నగర్‌కు అంకితం

'నన్ను ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించిన మహబూబ్‌నగర్‌ ప్రజలకు ధన్యవాదాలు, ఐదేళ్లు నిజాయితీగా, అవినీతి లేకుండా ధర్మపాలన చేస్తా'అని కాంగ్రెస్‌ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గెలుపొందిన అనంతరం ఆయన కౌంటింగ్‌ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. రూ.కోట్లు ఖర్చుపెట్టినా మహబూబ్‌నగర్‌ ప్రజలు ఒక్కతాటిపైకి వచ్చి కాంగ్రెస్‌కు విజయాన్ని చేకూర్చారని అన్నారు. ఈ విజయం యెన్నంది కాదని, స్వేచ్ఛ, స్వాతంత్య్రం కోరుకునే ప్రతి మహబూబ్‌నగర్‌ బిడ్డదని అన్నారు. కార్యకర్తలు కష్టపడి పనిచేసినట్లు తెలిపారు. ఆరు గ్యారంటీ పథకాలను కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ విజయం మహబూబ్‌నగర్‌ ప్రజలకు అంకితమని అన్నారు.

ప్రజాతీర్పును గౌరవిస్తున్నాం

జడ్చర్ల టౌన్‌: పదేళ్లుగా ప్రజలకు సేవచేసేభాగ్యాన్ని కల్పించినందుకు జడ్చర్ల నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి ప్రకటించారు. సామాజిక మాధ్యమాల ద్వారా పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రజలకు రుణపడి ఉంటానని ప్రకటించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. గెలుపొందిన బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలకు అభినందనలు తెలియజేశారు.



మిడ్జిల్‌లో..



బంద్రపల్లిలో..

అంబరాన్నంటిన సంబురాలు

సాక్షినెట్‌వర్క్‌: దేవరకద్ర ఎమ్మెల్యేగా కాంగ్రెస్‌ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి విజయం సాధించడంతో ఆదివారం అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ జెండాలను చేతపట్టి ర్యాలీలు నిర్వహించారు. జి. మధుసూదన్‌రెడ్డి విజయం సాధించడంతో చిన్న చింతకుంట మండలంలోని గ్రామాల్లో కాంగ్రెస్‌ నాయకులు సంబురాలు చేసుకున్నారు.

- పాలమూరు నియోజకర్గంలో యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విజయం సాధించడంతో హన్వాడలో సంబురాలు అంబరాన్నంటాయి.
- కాంగ్రెస్‌ అభ్యర్థి పర్ణికారెడ్డి గెలుపుతో కోయిల్‌కొండ మండల కేంద్రంలోని స్వామి వివేకానంద చౌరాస్తాలో కాంగ్రెస్‌ నాయకులు ర్యాలీ తీశారు.
- బాలానగర్‌ మండల కేంద్రంలో కాంగ్రెస్‌ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తల్లి శశికళా రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో నియంత పాలన పోయిందని అన్నారు.
- నవాబుపేట మండలంలో కాంగ్రెస్‌ నాయకులు టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.
- మిడ్జిల్‌లో టీపీసీసీ కార్యదర్శి రబ్బానీ, నాయకులు అల్వాల్‌రెడ్డి, గౌస్‌, వెంకటేష్‌గౌడ్‌, సాయిలు, నర్సింహ, అశోక్‌, తదితరులు పాల్గొన్నారు.
- పరిగి అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఉమ్మడి గండేడ్‌ మండలంలోని వెన్నాచేడ్‌, గండేడ్‌, మహమ్మదాబాద్‌, గాధిర్యాల్‌, సంచర్ల, కొంరెడ్డిపల్లి, సల్కర్‌పేట్‌, పగిడ్యాల్‌ , బల్సుర్‌గొండ, రెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం కార్యకర్తలు ఆనందోత్సాహాల్లో మునిగి తేలారు.



మూసాపేటలో సంబరాలు చేస్తున్న కాంగ్రెస్‌ శ్రేణులు



నవాబుపేటలో..



కోయిల్‌కొండలో..

శ్రీకాంతాచారికి ఘన నివాళి

జడ్చర్ల టౌన్‌: తెలంగాణ మలి ఉద్యమానికి ఊపిరి పోసిన అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం మున్సిపాలిటీలో ఘన నివాళులు అర్పించారు. ఉమెన్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిగ్నల్‌గడ్డపై ఉన్న ఆయన విగ్రహానికి కాంగ్రెస్‌పార్టీ నాయకులు పలువురు వేరు వేరుగా వచ్చి పూలమాలలు వేసి నివాళులు అర్పించి శ్రీకాంతాచారి అమర్‌హై అంటూ నినదించారు.

అడ్డాకుల: తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించి ఉద్యమానికి ఊపిరి పోసిన అమరుడు శ్రీకాంతాచారికి మండల కేంద్రంలో ఆదివారం ఉద్యమకారులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక బస్టాండ్‌ ఆవరణలో మాజీ ఎంపీటీసీ భీమన్నయాదవ్‌ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్‌ షఫీ, సాయిరెడ్డి, క్యాసని శ్రీను, శేఖర్‌రెడ్డి, నిరంజన్‌ ఉన్నారు.



అడ్డాకులలో శ్రీకాంతాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కురుమూర్తిలో భక్తజన సందోహం



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న గాజుల దుకాణం

- వైభవంగా జాతర ఉత్సవాలు
- మార్మోగిన గోవింద నామస్మరణ

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి జాతర ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ముందుగా కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. ఆలయ అర్చకులు స్వామి వారికి సుప్రభాత సేవతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర మైదానంలోని దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. రంగులరాట్నాలు, బోటింగ్‌, హంస వాహనం, బెలూన్‌ షూటింగ్‌లతో పలువురు సరదాగా గడిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది చర్యలు తీసుకోవడంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జాతర ఏర్పాట్లను ఆలయ చైర్మన్‌ ప్రతాప్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, సిబ్బంది శ్రీకర్‌, శివానందాచారి పర్యవేక్షించారు.

రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న డీఎస్పీ

అడ్డాకుల: మండలంలోని కందూర్‌ రామలింగేశ్వర స్వామిని ఆదివారం రాత్రి డీఎస్పీ బంటు కిషన్‌ సందర్శించారు. ఆలయాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి పనులు చేయించిన డీఎస్పీ శివలింగానికి అభిషేకం చేశారు. అనంతరం గౌరమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. కాగా ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి స్థానికులతో మాట్లాడారు.



జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి ఘనస్వాగతం

రాజాపూర్‌: జడ్చర్ల ఎమ్మెల్యేగా ప్రజాక్షేత్రంలో విజయం సాధించిన నేపథ్యంలో ఆదివారం సొంత మండలమైన రాజాపూర్‌లో నాయకులు, అభిమానులు అనిరుధ్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. అనంతరం తన సొంతగ్రామమైన రంగారెడ్డిగూడ గ్రామం చేరుకోగానే గ్రామస్తులు, అభిమానులు పెద్ద ఎత్తున టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనిరుధ్‌రెడ్డి గ్రామంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అనిరుధ్‌రెడ్డితో ఆయన మాతృమూర్తి రంగారెడ్డిగూడ సర్పంచ్‌ శశికళారెడ్డి

ప్రతిఒక్కరికీ అండగా ఉంటా

భూత్పూర్‌: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో కాంగ్రెస్‌ కార్యకర్తను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, ఇప్పుడు ప్రతిఒక్కరికీ తాను అండగా ఉంటానని దేవరకద్ర ఎమ్మెల్యేగా ఎన్నికైన జి. మధుసూదన్‌ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండల కాంగ్రెస్‌ నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. టపాసులు, బాణ సంచాలు కాల్చి పెద్ద ఎత్తున స్వాగతించారు. అనంతరం భూత్పూర్‌ చౌరస్తాలో మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. సోనియా గాంధీ, రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్యారంటీ పథకాలను అమలు చేసి తీరుతామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రూరల్‌ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు నవీన్‌ గౌడ్‌, మాజీ మండల అధ్యక్షుడు వెంకట్‌ నర్సింహారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.



భూత్పూర్‌లో మధుసూదన్‌రెడ్డికి స్వాగతం పలికిన కాంగ్రెస్‌ నాయకులు

పద్నాలుగేళ్లకోసారి కాంగ్రెస్‌కు అవకాశం

జడ్చర్ల/జడ్చర్ల టౌన్‌: నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీకి పూర్వవైభవం దక్కింది. ఆదివారం వెలువడిన ఫలితాలలో పార్టీ అభ్యర్థి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి విజయం సాధించటంతో శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. నియోజకవర్గ చరిత్రను పరిశీలిస్తే పద్నాలుగేళ్లకోసారి కాంగ్రెస్‌కు ప్రజలు కడుతున్నారనేది స్పష్టం అవుతోంది. 1983లో ఎన్టీఆర్‌ హవాతో ఓటమి పాలైన కాంగ్రెస్‌కు 1989లో సుధాకర్‌రెడ్డి రూపంలో విజయం వరించింది. ఆ తరువాత 1994 వరకు ఆయన ఎమ్మెల్యేగా కొనసాగారు. తిరిగి 14ఏళ్ల తరువాత అంటే 2008 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ ఎమ్మెల్యేగా డా. మల్లురవి గెలుపొందారు. 2009, 2014, 208లో తిరిగి కాంగ్రెస్‌ ఓటమి పాలయ్యింది. మళ్లీ పద్నాలుగున్నరేళ్ల తరువాత 2023లో కాంగ్రెస్‌ విజయం సాధించింది.

రాజాపూర్‌లో హస్తానికే ఆదరణ

రాజాపూర్‌: జడ్చర్ల అసెంబ్లీ పరిధిలోని రాజాపూర్‌ మండలంలో హస్తం వైపు ప్రజలు మొగ్గు చూపారు. రంగారెడ్డిగూడలో మొత్తం 1200 ఓట్లకు గానూ 912 ఓట్లు పోల్‌ అయ్యాయి. అందులో 257 బీఆర్‌ఎస్‌కు, బీజేపీకి 33, కాంగ్రెస్‌కు 622 ఓట్లు పోలయ్యాయి. కల్లేపల్లిలో కాంగ్రెస్‌కు 800 ఓట్లు లీడ్‌రాగా, చెన్నవెల్లి, ఈద్గాన్‌పల్లి, కుచ్చుర్‌కల్‌ గ్రామాల్లో సైతం కాంగ్రెస్‌ హవా సాగింది. రాజాపూర్‌ మండలంలో మొత్తం అనిరుధ్‌రెడ్డికి 3,600 ఓట్లు లీడ్‌ వచ్చాయి.

ఉమ్మడి గండేడ్‌లో కాంగ్రెస్‌ హవా

గండేడ్‌/మహమ్మదాబాద్‌: ఉమ్మడి గండేడ్‌ మండలంలో కాంగ్రెస్‌ హవా కనిపించింది. ఆదివారం నాడు నిర్వహించిన కౌటింగ్‌లో ప్రతి బూత్‌లోనూ రామ్మోహన్‌రెడ్డి ఆధిక్యం వచ్చింది. ఒక్క 63 బూత్‌లో మాత్రం బీఆర్‌ఎస్‌కి 10 ఓట్లు ఆధిక్యం వచ్చింది. మొత్తంగా ఉమ్మడి మండలంలో కాంగ్రెస్‌కు 7568 ఓట్ల ఆధిక్యం దక్కింది.

కోయిలకొండలో పర్ణికారెడ్డికి ఆధిక్యం

కోయిల్‌కొండ: మండలంలో 43, 500మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 61 బూత్‌లకు సంబంధించి కాంగ్రెస్‌కు 21,512, బీఆర్‌ఎస్‌కు 17, 965, బీజేపీకి 2,657, బీఎస్పీకి 585, ఇతరులకు 781 ఓట్లు వచ్చాయి. మొత్తంగా కాంగ్రెస్‌ అభ్యర్థి పర్ణికారెడ్డికి 3,547 ఓట్ల ఆధిక్యం లభించింది.

మిడ్జిల్‌ మండలంలో..

మిడ్జిల్‌: అంసెబ్లీ ఎన్నికల ఫలితాలలో మిడ్జిల్‌ మండలంలో కాంగ్రెస్‌ ఆధిక్యం కనబరిచింది. కాంగ్రెస్‌కు బోయిన్‌పల్లిలో 472 మెజార్టీ రాగా, మిడ్జిల్‌లో 345, వెలుగొమ్ములలో 286, మంగళిగడ్డ తండాలో 182, చౌటకుంట తండాలో 123, వేములలో 91, వల్లభ్‌రావుపల్లిలో 85, లింబ్యా తండాలో 66, వాడ్యాల్‌లో 60, ఈదులబావి తండాలో 52, కొత్తూర్‌లో 42, అయ్యవారిపల్లిలో 29, వస్పులలో 7, మసిగొండ్లపల్లి01, మున్ననూర్‌లో 01 ఆధిక్యం వచ్చాయి. బీఆర్‌ఎస్‌కు దోనూర్‌లో213, కంచన్‌పల్లిలో 106, మసిగొండ్లపల్లిలో 105, కొత్తపల్లిలో 76, మల్లాపూర్‌లో73, చిల్వేర్‌లో 48, పెద్దగుంట్ల తండాలో 14, రాణిపేట్‌లో 09, సింగందొడ్డిలో 01 ఆధిక్యం వచ్చింది. మొత్తంగా కాంగ్రెస్‌కు 1197ఓట్ల ఆధిక్యం లభించింది.

మూసాపేటలో మధుసూదన్‌రెడ్డికే మొగ్గు

అడ్డాకుల: మూసాపేట మండలంలో కాంగ్రెస్‌ పార్టీకి ఆధిక్యత లభించింది. మండల వ్యాప్తంగా కాంగ్రెస్‌కు 7,543 ఓట్లు రాగా బీఆర్‌ఎస్‌కు 7,283 ఓట్లు లభించాయి. దీంతో 260 ఓట్ల ఆధిక్యత కాంగ్రెస్‌కు దక్కినట్లయింది. కాంగ్రెస్‌కు వేములలో 464 ఓట్లు, జానంపేటలో 324 ఓట్లు, కొమిరెడ్డిపల్లిలో 201 ఓట్లు, మూసాపేటలో 145 ఓట్లు, నందిపేటలో 108 ఓట్ల ఆధిక్యత లభించింది. బీఆర్‌ఎస్‌కు నిజాలాపూర్‌లో 482 ఓట్లు, తిమ్మాపూర్‌లో 218 ఓట్లు, తుంకినీపూర్‌లో 180 ఓట్లు, పోల్కంపల్లిలో 136 ఓట్ల మెజార్టీ దక్కింది. ఇదిలా ఉండగా మహబూబ్‌నగర్‌ రూరల్‌ మండలంలో గాజులపేట గ్రామంలోనే బీఆర్‌ఎస్‌కు 702 ఓట్ల భారీ ఆధిక్యత లభించింది. కాగా మూసాపేట మండల వ్యాప్తంగా బీజేపీకి 919 ఓట్లు లభించాయి. ఈ పార్టీకి వేములలో అత్యధికంగా 253 ఓట్లు, నిజాలాపూర్‌లో 136 ఓట్లు దక్కాయి.

అడ్డాకులలో బీఆర్‌ఎస్‌కు ఆధిక్యత

అడ్డాకుల: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మండలంలో బీఆర్‌ఎస్‌కు స్వల్ప ఆధిక్యత లభించింది. మండల వ్యాప్తంగా బీఆర్‌ఎస్‌కు 8,180 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 8,026 ఓట్లు లభించాయి. దీంతో 154 ఓట్ల స్వల్ప ఆధిక్యత బీఆర్‌ఎస్‌కు దక్కినట్లయింది. కందూర్‌లో 115 ఓట్లు, ముత్యాలంపల్లిలో 154 ఓట్లు, వర్నెలో 20 ఓట్లు, గుడిబండలో 79 ఓట్లు, తిమ్మాయిపల్లిలో 59 ఓట్లు బీఆర్‌ఎస్‌కు మెజార్టీ దక్కింది. కాంగ్రెస్‌కు అడ్డాకులలో 110 ఓట్లు, శాఖాపూర్‌లో 81 ఓట్లు, కాటవరంలో 133 ఓట్లు, తిమ్మాయిపల్లి తండాలో 81 ఓట్లు, రాంచంద్రాపూర్‌లో 54 ఓట్ల ఆధిక్యం దక్కింది.